క్లుప్తంగా

29 నుంచి కోదండరాముని బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

చిత్తూరు రూరల్: కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 29 నుంచి నిర్వహించనున్నట్లు చైర్మన్ సకల వెంకటేష్ గుప్తా తెలిపారు. నగరంలోని ఆ ఆలయంలో సోమవారం వారు సమావేశం నిర్వహించి బ్రహ్మోత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9వ తేదీ వరకు సాగుతాయని స్పష్టం చేశారు. ఒక్కో రోజు ఒక్కో వాహనంలో స్వామి వారు విహరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సుబ్రమణ్యం నాయుడు, రాజా, హేమాద్రి రావు, ఎం మాధవి, ఈశ్వరి, దుర్గాదేవి, అర్చకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 50 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందు లో 36 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు.

లీజుకు ఆర్టీసీ బస్టాండు స్థలం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఖాళీ స్థలం లీజుకు ఇవ్వనున్నట్లు పలమనేరు డిపో మేనేజర్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ పక్కన 0.42 సెంట్ల ఆర్టీసీ బస్టాండ్ స్థలం ఉందన్నారు. ఈ నెల 16వ తేదీ ఖాళీ స్థలం 15 ఏళ్ల లీజు ఇవ్వడానికి వ్యాపారులతో ప్రీ–బిడ్డింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిపాదిత బస్టాండ్ ఖాళీ స్థలంలో కల్యాణ మండపం, మాల్స్, ఫంక్షన్‌హాల్, ఇండోర్ స్టేడియం, సూపర్‌బజార్, కారు పార్కింగ్, ఇతర అనుమతి పొందిన వ్యాపారాలకు టెండరు విధానంలో లీజు పొందవచ్చని తెలిపారు. 9959225678, 7382874544ను సంప్రదించాలని కోరారు.







చిత్తూరు: కన్నన్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పరిశీలకులు కోనశశిధర్, కాటమనేని భాస్కర్, ఆర్డీవో రేణుక తదితరులు, పీసీఆర్ పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన టీడీపీ శ్రేణులను బయటకు పంపుతున్న పోలీసులు, గుడిపాల: బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు

మండలి పోలింగ్ ప్రశాంతం

- పోలింగ్ కేంద్రాల వద్ద పచ్చ నేతల హడావుడి
- పర్యవేక్షించిన అధికార యంత్రాంగం

చిత్తూరు అర్బన్/ కార్పొరేషన్/ రూరల్: శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలతోపాటు బిఎస్.కణ్ణన్ జూనియర్ పాఠశాలలోని కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కణ్ణన్ కళాశాలను అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్, చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చిత్తూరు ఆర్డీవో రేణుక, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా.అరుణ సైతం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇక స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద తదితరులు పోలింగ్ సరళిని వారి పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

తమ్ముళ్ల అతి..

మరోవైపు ప్రశాతంగా జరుగుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు హడావుడి చేస్తూ కనిపించారు. నగరంలోని ప్రధాన నాయకులు కొందరు ఓటర్లను దగ్గరుండి తీసుకెళ్లి ఓట్లు వేయించడం కనిపించింది. పట్టభద్రులకు కొందరికి ఓటుకు రూ.500 ఇస్తూ ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ ముగుస్తుందనగా పెద్ద సంఖ్యలో కలిసి పీసీఆర్ కళాశాల పోలింగ్ కేంద్రంలోకి చొరబడటానికి ప్రయత్నించగా.. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు తన సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు.

గుడిపాలలో 77.7 శాతం పోలింగ్

గుడిపాల: మండలంలో పట్టభద్రులు 1008 ఓట్లకు గాను 784 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయులు 39 ఓట్లకు గాను 36 ఓట్లు పోలయ్యాయి. ఉదయం కొంచెం మందకొడిగా ఉన్నప్పటికీ 10 గంటలనుంచి పోలింగ్ పుంజుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్త్ నిర్వహించారు. సెల్‌ఫోన్లకు ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు టీచర్స్ అబ్జర్వర్ కోనశశిధర్‌తోపాటు ఎన్నికల పరిశీలకులు భాస్కర్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ శాతం నమోదును తనిఖీ చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.



చిత్తూరు: ఏజెంటు శిబిరం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బంగారుపాళెం: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు.

టీడీపీ నాయకుల వాగ్వాదం

తెలుగుదేశం నాయకులు పోలీసుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా వైఎస్సార్, టీడీపీ నాయకులు పరస్పరం దూషణలకు దిగారు. దీంతో ఎస్ఐ రాజశేఖర్ ఇరువురికి నచ్చచెప్పారు. ఇంతలో కొంతమంది టీడీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిని స్టేషన్‌కు తరలించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం డీఎస్పీ శ్రీనివాసమూర్తి పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

పూతలపట్టు నియోజకవర్గంలో..

పూతలపట్టు: మండల కేంద్రంలో పట్టభద్ర ఓటర్లు 1799 మంది ఉండగా...1396 మంది ఓటు వేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 134 మందికి గాను 117 మంది ఓటు వినియోగించుకున్నారు. జేసీ వెంకటేశ్వర్లు ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, సీఐ ఆశ్వీరాదం తదితరులు ఉన్నారు.

ఓటింగ్ సరళి పరిశీలన

తవణంపల్లె: మండల కేంద్రంలో ఓటింగ్ సరళిని ఎన్నికల పరిశీలకులు, చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి పరిశీలించి ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి,ఎస్ఐ ప్రసాద్, డీటీ నరేష్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో 1653 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1257 ఓట్లు (76 శాతం) పోలైనవి. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి మండలంలో 58 మంది ఓటర్లు ఉండగా 56 ఓట్లు (97 శాతం) పోలయ్యాయి. పోలింగ్ కేంద్రం వద్ద డాక్టర్ ప్రియాంక నేతృత్వంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 1966 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1409 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అదే విధంగా మండలంలో 131 మంది ఉపాధ్యాయుల ఓటర్లు ఉండగా 99 మంది ఓటుహక్కు వినియోగించుకొన్నారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎన్నికల పరిశీలకులు డీఎస్పీ తిప్పేస్వామి పరిశీలించారు. తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఎస్ఐ వెంకటేశ్వర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంగారుపాళెంలో ప్రశాంతం

బంగారుపాళెం: మండలంలో పోలింగ్ కేంద్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సందర్శించారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో 145ఉపాధ్యాయుల ఓట్లుంటే, 134 ఓట్లు, పట్టభద్రులు 2210 ఓట్లకు గాను 1772 ఓట్లు పోలైనట్లు చెప్పారు. సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి గట్టి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో నిలిచిఉన్న భట్టభద్రుల మహిళా ఓటరు కళ్లుతిరిగి కిందపడిపోయింది. దాంతో ఆరోగ్య సిబ్బంది, పోలీసులు మహిళను ఆస్పత్రికి తరలించారు.

యాదమరిలో కాస్త ఉద్రిక్తత

యాదమరి: మండలంలో పట్టభద్రులు 1450 మంది ఉంటే, 1146 మంది ఓటేశారు. ఉపాధ్యాయులు 58మంది ఉండగా 55 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. మొత్తం 80శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారి చిట్టిబాబు తెలిపారు. డీఎస్పీ తిప్పేస్వామి, సీఐ శ్రీనివాసుల రెడ్డి, ఎస్ఐ సుమన్ గట్టి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి పరిశీలించారు. చివర్లో టీడీపీకి చెందిన పట్టభద్రుడు ఓటు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పోలీసులు ఆపి గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కాని అతను గుర్తింపు కార్డు చూపించక పోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో టీడీపీ నాయకులు అక్కడికి చేరుకోవడంతో కాస్త ఉద్రిక్తవాతవరణం ఏర్పడింది. వెంటనే పోలీసులు అందరిని అక్కడి నుంచి పంపేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



గుడిపాల: పోలింగ్ కేంద్రంలో కోనశశిధర్



గుడిపాల: పోలింగ్ బూత్ వద్ద పోలీసు భద్రత



గుడిపాల: పోలీసులతో టీడీపీ నేతల వాగ్వాదం



తవణంపల్లె: పోలింగ్ కేంద్రంలో డీఎస్పీ తిప్పేస్వామి



చిత్తూరు క్యూలో ఉన్న పట్టభద్రులు











బంగారుపాళెం : పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పడిపోయిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, పూతలపట్టులో.. ఐరాలలో... యాదమరిలో ఓటేయడానికి వస్తున్న దివ్యాంగులు

గ్రామీణ వైద్యం.. శిక్షణతో నాణ్యం

పల్లె ముంగిట్లో మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే రెండేళ్ల క్రితం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు రూపుదిద్దుకున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఈ క్లినిక్‌లు సేవలందిస్తున్నాయి. ఈ గ్రామీణ వైద్యాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు ఆరు రకాల సేవలపై ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమం జిల్లా స్థాయిలో వేగంగా కొనసాగుతోంది.



- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నాణ్యమైన సేవలు
- మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు ఆరు రకాల సేవలపై శిక్షణ
- డమ్మీ డాక్టర్లకు చెక్‌పడే అవకాశం



శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి



శిక్షణ పొందుతున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా 50 పీహెచ్‌సీల పరిధిలో 434 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇందులో వైద్య సేవలు అందించడంతోపాటు 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 12 రకాల సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార విలువపై అవగాహన కల్పించడం, ఐరన్ మాత్రల పంపిణీ, వ్యాక్సినేషన్ అందించడం, ఈ –సంజీవని నిర్వహణ కూడా కొన సాగుతోంది. ఈ అమలులో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కీలకంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొవైడర్ల ద్వారా పల్లె వైద్యాన్ని మరింత మెరుగు పరచేందుకు చర్యలు చేపట్టింది.

శిక్షణ ఇలా...

ఇది వరకు హెల్త్ క్లినిక్‌లో అందిస్తున్న 12 రకాల వైద్యసేవల్లోని ఆరు సేవలను మరింత మెరుగు పరచేలా ప్రభుత్వం మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో వారికి శిక్షణ అందిస్తోంది. జిల్లాలో 516 మంది వైద్య సిబ్బంది పనిచేస్తుండగా పలు బృందాలుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా ఈఎన్‌టీ, కన్ను సంబంధిత సమస్యలు, నోటి వ్యాధులు, వృద్ధుల సంరక్షణ, మానసిక వ్యాధులు, క్యాన్సర్ బాధితుల ఉప సంరక్షణకు తగిన వైద్యం అందించేందుకు కావాల్సిన శిక్షణ ఇస్తున్నారు. రెండు నెలల నుంచి ఈశిక్షణ కొనసాగుతుండగా ఇప్పటి వరకు 5 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయింది. మరో నెల రోజుల వ్యవధిలో శిక్షణను పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు సుకన్య, శివకుమార్, లోకేష్ పవన్ శిక్షణ ఇస్తున్నారు. అర్హతకు తగ్గ వైద్యం చేసేలా సూచనలు చేస్తున్నారు. అత్యవసర చికిత్సలు, ఇతర సమస్యలు ఉంటే పీహెచ్‌సీ డాక్టర్లు లేదా ఈ– సంజీవని డాక్టర్ల సలహాలు తీసుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసేలా తర్ఫీదునిస్తున్నారు. దీంతో పల్లె వైద్యానికి మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు మరింత ప్రాణం పోయనున్నారని అధికారులు చెబుతున్నారు.

డమ్మీ వైద్యులకు చెల్లు

పల్లెల్లో కొందరు డమ్మీలు డాక్టర్లుగా చెప్పుకుంటూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇష్టానుసారంగా మందులు, మాత్రలు ఇవ్వడంతోపాటు అధిక డోస్‌తో ఇంజెక్షన్‌లు చేస్తుంటారు. రోగం వెంటనే తగ్గిపోతుందని యాంటీబయాటిక్ మాత్రలు ఇచ్చేస్తుంటారు. దీంతో చాలా మంది కిడ్నీ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను తీసుకొచ్చి, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించింది. పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా పల్లె క్లినిక్‌లు పనిచేస్తాయని అంటున్నారు.

12 రకాల సేవలు ఇవే

గర్భిణీ	- బాలింతల సేవలు
చిన్న పిల్లలు	- పర్యవేక్షణ
ఫ్యామిలీ ప్లానింగ్	
కిశోర బాలికల సేవలు	
సంక్రమిత వ్యాధులు	
సాధారణ ఓపీ	
అసంక్రమిత వ్యాధులు	
నోటి సంబంధిత వ్యాధులు	
వృద్ధుల సంరక్షణ	
క్యాన్సర్ బాధితులకు చికిత్స	
ఈఎన్‌టీ సేవలు	
కంటి సమస్యలకు వైద్యం	

బహు బాగుగా...



పల్లె ప్రజలు సరైన అవగాహన లేక అనారోగ్య సమస్యలను కొన్ని తెచ్చుకుంటున్నారు. సమస్యలు వచ్చినప్పుడు సరైన వైద్యం తీసుకోవడం లేదు. ఈ కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం పల్లెకు క్లినిక్‌ను తెచ్చింది. అక్కడ వైద్య సేవలను మెరుగు పరిచేందుకు మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు శిక్షణ ఇస్తున్నాం. త్వరలో ఈ శిక్షణ కూడా పూర్తి కానుంది.

- డాక్టర్ సుకన్య, శిక్షణాధికారి

ఈ శిక్షణ ఉపయోగకరం



ఇప్పటి వరకు వైద్యసలహాలు, తగిన మాత్రలు పంపిణీ, గ్రామాల్లో పర్యటించి బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలను పర్యవేక్షిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో రకరకాల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. అందులో మానసిక జబ్బు ఒకటి. ఇలాంటి వాటికి ఇప్పుడు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంది. అత్యవసర చికిత్సను ఏ విధంగా అందించాలో క్లుప్తంగా నేర్పించారు. మానసిక జబ్బులను కొత్తగా పరిచయం చేశారు.

-మానస, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, టేకుమంద క్లినిక్, బంగారుపాళెం

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్ల పరిశీలనలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను నగర కమిషనర్ అరుణ సోమవారం ఉదయం పరిశీలించారు. పీసీఆర్ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, బీఎస్ కణ్ణన్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం నిర్వహణ, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనులపండువగా పుష్పయాగం



బైరెడ్డిపల్లె మండలంలోని శ్రీనల్లగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పయాగం వేడుకగా నిర్వహించారు. అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులను వేదికపై కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

- బైరెడ్డిపల్లె